


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### *అల్లారూ ముద్దు కదే!*

**సెల్యులాయిడ్ ప్రేమలూ,** టీ.వీ ప్రేమలూ నిజ జీవితాల్లో చూడగలమా? నేను అల్లారుముద్దుగా పెరిగాను. మా ఇంట్లో చాలా ముద్దు చేసేవారు, పదకొండు మంది మనవలలో నేను ఆఖరిదాన్ని. ఎవరైనా ఇంటికొస్తే, అమ్మమ్మ వాళ్ళకి పలహారం పెడ్తే, వాళ్ళు "ఒద్దండీ" అనేవారు, కొందరు "ఇప్పుడే తీసుకుని వస్తున్నాం. వద్దు అండీ" అనేవారా. నేను వెంటనే "అయితే నేను తింటాలెండి" అని ఆ పళ్ళెం లోపలికి తీసుకు రాబోతుంటే, అమ్మమ్మ నా జబ్బుమీద, కప్ప పెట్టినట్లు (అంటే జబ్బులో కండవూడి వచ్చేట్లు పట్టుకుని) "నువ్వు అక్కర్లేదు లోపలికెళ్ళు తల్లీ. మా రోణు బుజ్జిగాడు ఎంత పనిమంతురాలో" అని నవ్వేది.

నా రెక్క రెండు రోజులు ఇంజెక్షన్ చేయించుకున్నంత నెప్పిగా వుండేది. కానీ నన్ను అందరూ అల్లారు ముద్దుగా చూసేవారు.

మంచినీళ్ళు తెచ్చి పెట్టలేదని అన్నయ్యలు మొట్టికాయలూ, అమ్మ "కొంచెం భయం పెట్టండి, మా ఆశలన్నీ దానిమీదే అల్లారుముద్దుగా చూస్తున్నాం, పెంకిదైపోతోంది" అందని క్రీస్తుమణి టీచర్ బెత్తం వాతలు పడేట్లు వీపు మీద కొట్టి" అసలే మీ అమ్మ ఆశలన్నీ నీమీదే పాపం. కష్టజీవి సత్యవతమ్మ" అనేది.

అమ్మమ్మ అయితే ఎండలో బడితెలా తిరుగుతున్నాను, వేసవి కాలంలో ఇంటింటికీ అని, చెవి వూడివచ్చేట్లు నులమడంలో, వీపు సాపు చేయడంలో ముఖం చూసుకునేది కాదు. అమ్మ నాకన్నా పన్నెండు, పదకొండేళ్ళు పెద్దవాళ్ళయిన అక్కలతో స్నేహంగా వుండేది. రాత్రుళ్ళు పడుకున్నాక, వాళ్ళు చెప్పులు చేతుల్లో పట్టుకుని, చప్పుడు కాకుండా సినిమాలకి వెళ్ళేవారు. ఊళ్ళకి వెళ్ళేటప్పుడు, మా అక్కలని తీసుకెళ్తూ, నాకో అర్ధరూపాయి ఇచ్చి, మిఠాయి షాప్ నుండి పెండలం చిప్స్ తెమ్మనేది, నేను అటు వెళ్ళగానే గొర్రెలా ఈ కసాయి వాళ్ళని నమ్మి. వీళ్ళు సూట్ కేసులతో దొంగల్లా పరారే!. ఎప్పుడో చిన్నప్పుడు నన్ను ఎత్తుకుని ముద్దులాడి "ఆయిల్ క్లాత్ పై గెంతులు వేసే బొమ్మా నీ పేరెవరమ్మా.. మా రమణమ్మా.." అని పాటలు కట్టి పాడుకుని ముద్దు చేసామని బ్లాక్ మెయిల్ చేస్తూ, వాళ్ళ పనులు నా చేత చేయించుకునేవారు. ఆఖరిది అందరికీ లోకువ అనుకునేదాన్ని.

వీధిలో మా అక్కలు ప్రబంధ నాయకల్లా వెళ్తుంటే వెంటబడే ఆ కాలం కుర్రాళ్ళకి కూడా నేనంటే లోకువే "ఏయ్ బుజ్జీ! ష్..ష్. మీ అక్క కిస్తావా ఈ లెటర్. నీకు చాక్లెట్ కొని పెడ్తా" అనేవాళ్ళు.

నాకు కోపం వచ్చేది. ఇంతోటి వెధవ చాక్లెట్‌కి పడిపోతానా?

"నా కేం అక్కర్లేదు నీ మెహర్బానీ. ఇటియ్యి ఇస్తాను" అని లాక్కున్నట్లు తీసుకెళ్ళేదాన్ని.

అప్పటి రోజులు ఎంత పాత చింతకాయ పచ్చడి రోజులండీ.. మా అక్కకి జేకబ్ అనే వాడు "సాయంత్రం బస్ స్టాప్‌లో రెడీగా వుండు సినిమాకి తీసుకెళ్తా" అని ఉత్తరం రాసాడని, అది అదేదో సినిమాలో మాలాసిన్హాలా కళ్ళు వాచేటట్లు ఏడ్చి, తప్పు చేసినట్లు అన్నం నీళ్ళూ మానేసి, గదిలో గెడ పెట్టుకుని కంటికి మింటికి ఏకధారగా ఏడుస్తుంటే, అవేమైనా ఏడంతస్తుల మేడలా? "ఒసేయ్ నా మడి బట్ట తీసుకోవాలి తలుపు తియ్" అని అమ్మమ్మా, "నా సైన్స్ రికార్డ్ వుంది, తలుపు తీస్తావా? విరగ్గొట్టమంటావా?" అని రాము అన్నయ్యా, "ఏవైందే?" అని ఇంకో అక్కా బతిమాలితే, అరపూట తర్వాత తలుపు తెరిచి అమ్మమ్మ కాళ్ళమీద పడ్డంత పని చేసి "నాకేం తెలీదు అమ్మమ్మా ఇది దాని పని. అది తెచ్చి ఇచ్చింది" అనగానే ఆవెధవ రాసినందుకు కాదు కానీ, తెచ్చినందుకు నా వీపు విమానం మోత మోగేది. చివరకి చాక్లెట్ లంచంకూడా త్యాగం చేసి నేను చేసిన సేవలకి ఇదీ ప్రత్యుపకారం.

ఆ వెధవ ఇచ్చిన చాక్లెట్ తీసుకున్నా బావుండేది. వీళ్ళు నన్ను ఓ లంచగొండిలా, అపరాధిలా చూస్తూ "చెప్పు చాక్లెట్ కొని పెడ్తానంటే తెచ్చావా?" అని గద్దిస్తే, అవమానంతో, దెబ్బల బాధతో నేను ఎన్నిసార్లు కృంగిపోయానో.

ఏడుస్తూనే, మా అక్కని "చెప్పు సినిమాకి నువ్వెళ్ళకపోతే నన్ను తీసుకెళ్ళమంటాను జేకబ్‌గాడ్ని" అనగానే మళ్ళీ నా వీపు విమానం మోత. ఏడేళ్ళప్పుడు సినిమాలు చూడాలని వుండదా? వుండకూడదా? ఆ కాలంలో అదొక్కటేగా ఎంటర్‌టైన్‌మెంట్. అరుగుల మీద కూర్చుని చింతకాయలు గింజ తీసే నెపంతో, అనసూయా వాళ్ళమ్మా, అమ్మమ్మా, సందానీ తల్లిలా ముచ్చట్లాడలేం, పనిలేని పోరంబోకు మావయ్యల్లా పేకాట ఆడలేం. రేడియోలు చెవుల్లో దూర్చుకుని, ప్రపంచం మునిగిపోతోంది కాసేపట్లో అన్నట్లు అన్నయ్యల్లా క్రికెట్ కామెంట్రీ వినలేం. అక్కల్లా వాళ్ళు లోకంలో వాళ్ళు ఎస్.పుశీల పాటల పుస్తకాలు, సారీ పి.సుశీల పాటల పుస్తకాలు బట్టీ పడ్తూ, చెంపలకి స్నోలు రాసేసుకుంటూ, కాటుక కళ్ళ చివర గీతలు గీసేస్తూ ఊహాలోకాల్లో తేలిపోయే వయసుకాదు. ఏవిటో ఆ కాలంలో నవలలు చదివే, చెంపల మీద నుండి కన్నీళ్ళు కారేట్లు ఏడ్చేలోక జ్ఞానం లేని శుంఠలు.

ఇంతకీ జాకబ్ గాడి లెటర్ దగ్గర ఆగాం కదూ. అమ్మమ్మ నిజంగా కొన్నిసార్లు సినిమాల్లో సూర్యకాంతంలా బిహేవ్ చేసేది. జాకెబ్‌గాడు ఎంత మంచివాడు. సినిమా చూపిస్తానన్నాడు. దానికి ఈవిడ ప్రైవేట్ చెప్పడం అవసరమా? సరిగ్గా సూర్యకాంతంలా నడుచుకుంటూ, వాళ్ళ ఇంటికి వెళ్ళి సరిగ్గా ఏడుగంటలకి జేకబ్ తల్లితండ్రులూ, చెల్లెలూ ప్రేయర్ చేసి 'ఆమెన్' అన్నాక, "మీ అబ్బాయిని దారిలో పెట్టుకోండి. ఈ అమ్మమ్మ మనవరాళ్ళ జోలికి రానీయకండి" అంటూ బ్రిటీషర్స్ లాఠీ చార్జీ రోజుల్లో తను గుండుకి ఎలా ఎదురు నిలబడిందో, తాతయ్యతోబాటు ఎలా జైళ్ళకి వెళ్ళిందో, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌తో కలిసి ఉప్పు సత్యాగ్రహంలో ఎలా పాలుపంచుకుందో, లక్నో అడవుల్లో మగాళ్ళతో సమానంగా ఎలానడిచి వెళ్ళిందో 22 రీళ్ళ సినిమా వేసింది. దాంతో వాళ్ళ నాన్న జార్జ్‌గారు, ఈవిడ కాళ్ళమీద పడినంత పనిచేసి, "అమ్మా, మీ గురించి మాకు తెలీదా? ఇంతగా చెప్పాలా? రానీండి ఆ వెధవని చెమ్డాలెక్కదీసేస్తాం" అన్నారు.

"నాకు చాక్లెట్ కూడా ఇస్తానన్నాడు" అని నేను వెనకనుండి అరిచాను. అమ్మమ్మ మళ్ళీ "దీన్ని అల్లారు ముద్దుగా పెంచాం. దీని చేతికిచ్చి పంపించాడు ఆ ఉత్తరం" అంటూ నన్ను రెక్కవూడేట్లు పట్టుకుని లాక్కొస్తూ, దారిలో ఫ్రెండ్స్‌తో గిల్లీ దండ ఆడుతున్న జేకబ్‌ని పిలిచి "ఏరా సినిమాకి తీసుకెళ్తావా మా అమ్మాయిని, నన్ను తీసుకెళ్ళు, నేను వస్తా" అంది.


"ఛీ! అమ్మమ్మతో జేకబ్ వెళ్తే బావుంటుందా? కనీసం నేను వెళ్ళినా బావుంటుంది కానీ, బొత్తిగా కామన్‌సెన్స్ లేని మాటలన్నీ మాట్లాడుతుందీవిడ. మళ్ళో బోలెడు బయోగ్రఫీ, స్వాతంత్ర సమరయోధురాలిగా. నాకైతే ఈవిడ బాడ్ బిహేవియర్‌కి చచ్చే సిగ్గుగా వుండేది. ఏడో క్లాసులో మా స్కూల్ వాళ్ళతో నాగార్జున సాగర్ పిక్‌నిక్‌కి వెళ్తానంటే "నేనూ వస్తా. తీసుకెళ్ళడానికి మీ స్కూల్ వాళ్ళు ఒప్పుకుంటే చెప్పు, డబ్బులు కడ్తా" అంటుందా? అసలు ఆ వయసులో ఆవిడ అనాల్సిన మాటేనా?

"అమ్మా మా మనవరాలిని అలాగా ఇలాగా పెంచలేదు. అల్లారుముద్దుగా పెంచాం. అలా పిక్‌నిక్‌లకీ అదీ పంపం" అని టీచర్‌కి చెప్తుంటే, "అల్లారు ముద్దుగా పెంచడం అంటే అస్తమానం నా చెవి వూడివచ్చేట్లు నులమడం, లెంపలు వాయించడమా?" అని అరవాలనిపించేది.

సినిమాల్లో అన్నలు "ఓ చెల్లీ అనురాగ వల్లీ" అని పాటలు పాడ్తారా, మా అన్నయ్య పతంగి ఎగరవెయ్యడానికి, వాడి చక్రీ దొంగిలించి విరగ్గొట్టాననీ, అద్దె సైకిల్ తీసుకుని ముంజెల వాడికి డాష్ ఇచ్చాననీ, అమ్మకి అస్తమానం నా మీద పితూరీలే. అమ్మకి ఆయుధం ఒకటి నన్ను తిట్టడం, రెండు ఆవిడ "ఓ పిల్లనిమ్మంటే, బ్రహ్మరాక్షసినిచ్చావేం దేవుడా?" అని తోట రాముడి తల్లిలా ఏడుపు. అసలు ఆ కాలంలో చక్కగా పూలు పెట్టుకుని, లంగా ఓణీల్లో డాన్స్‌లు చేసే ఈ.వీ సరోజా, ఎల్.విజయలక్ష్మిల కన్నా, అస్తమానం ఏడుస్తూ వుండే శ్రీరంజనీ, శాంతకుమారీ, అంజలీదేవీ, చంద్రకళ అంటే వీళ్ళకి ఇష్టం అనుకుంట. నాకైతే సినిమాల్లో చూపించినట్లు అమ్మ గోరింటాకు రుబ్బుతూ పాటలు పాడ్తూ, మా అందరికీ అన్నం కలిపి ముద్దలు పెడ్తూ "సంసారం...సంసారం.. ప్రేమ కథా సారం.. నవ జీవన వేదం..." అని పాడాలని కోరికగా వుండేది. కానీ హడావిడిగా ఆఫీస్‌కి వెళ్తూ, పాటల రిహార్సెల్స్‌కి వెళ్తూ, సినిమాల్లో చూపించే ప్రేమలు అసలు చూపించేదే కాదు అమ్మ.

అమ్మమ్మ ప్రేమ అయితే తట్టుకోలేం. రాత్రంతా కూర్చుని రెనెన్ మార్టెన్ గ్రామర్ బుక్ బట్టీ పట్టి, పొద్దుటే మాకు పాఠం చెప్పేది. తప్పు చేస్తే ఇసకలో నీల్‌డౌన్ చేయించేది. మాకు పాఠాలు చెప్తే పర్లేదు. స్కూల్ కొచ్చి తప్పు చెప్పారని మా టీచర్లకీ పాఠాలు చెప్పేది. అమ్మమ్మ వస్తుంటే మాకే కాదు, మా టీచర్లకీ హడల్. ఈవిడ అల్లారు ముద్దువల్ల మ పెద్దక్కకి లవ్ లెటర్ ఇచ్చిన జేకబ్‌ని వాళ్ళ నాన్న బోర్డింగ్ స్కూల్‌కి పంపించేస్తే మిగతా అబ్బాయిలు ఎవరూ మా ఇంటి ఆడపిల్లలకి ప్రేమలేఖ రాసే సాహసం చెయ్యలేదు. ఇవేం అల్లారుముద్దు ప్రేమలు బాబోయ్. పగ వాళ్ళకి కూడా వద్దు.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4